

సాక్షి బాపట్ల

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.5853 టీఎంసీలు. ఎగువ నుంచి 2,200 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1020 క్యూసెక్కులు విడుదల చేశారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.


న్యూస్‌రీల్

బౌడా చైర్మన్‌గా దేవినేని నియామకం



రేపల్లె: బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బౌడా) చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రేపల్లె మండలం రావి అనంతవరం గ్రామానికి చెందిన ఆయన 2004-09లోశాసనసభ్యుడిగా సేవలందించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 565.50 అడుగుల వద్ద ఉంది. ఇది 245.3435 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,767, ఎడమ కాలువకు 8,280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 29,816, ఎస్‌ఎల్‌బీసీకు 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 50,583 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 50,583 క్యూసెక్కులు వచ్చే చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 838.20 అడుగుల వద్ద ఉంది. ఇది 59.1632 టీఎంసీలకు సమానం.

యార్డులో 88,665 బస్తాల మిర్చి అమ్మకాలు



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 75,359 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 88,665 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 60,138 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పెనుగంచిప్రోలు తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు

జగ్గయ్యపేట అర్బన్:ఈ నెల 5 వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు నిర్వహించే పెనుగంచిప్రోలు శ్రీగోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నామని డిపో మేనేజర్ ఎంవీ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, నందిగామ, జగ్గయ్యపేట బస్‌స్టేషన్ల నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. తిరునాళ్ల ముగిసే వరకు పెనుగంచిప్రోలు నుంచి జగ్గయ్యపేట రాకుండా డైరెక్ట్‌గా విజయవాడకు బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. జగ్గయ్యపేట బస్టాండ్ నుంచి ప్రస్తుతం ఉన్న 10 బస్సులకు తోడు అదనంగా మరో పది తిప్పుతామన్నారు. ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. భక్తులు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

పింఛన్లు 97 శాతం పంపిణీ పూర్తి



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక మూడో రోజు గుంటూరు జిల్లాలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. జిల్లాలో మూడో రోజు 97.21 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,53,754 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.68 కోట్లు కేటాయించింది. శుక్రవారం సాయంత్రానికి 2,46,683 మంది లబ్ధిదారులకు రూ.67.73 కోట్ల నగదు అందజేశారు.

కళాతపస్వితో.. అల్లుకున్న బంధాలు

● దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్‌కు గుంటూరు జిల్లాతో ప్రత్యేక అనుబంధం ● పెదపులివర్రులో విషాదఛాయలు



తెనాలి: కేబుల్ టీవీలు లేని కాలమది.. సెల్‌ఫోన్ సంగతే తెలీదు. సోషల్ మీడియా ఊహల్లోనూ లేని రోజులు. అప్పట్లో తెలుగు సినిమా 'శంకరాభరణం' జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించింది. అంతర్జాతీయ వేదికల్లో ప్రదర్శితమైంది. అదే దర్శకుడు తీసిన సాగరసంగమం రష్యాలోనూ విజయవంతమైంది. స్వాతిముత్యం తొలిసారిగా తెలుగు సినిమాను ఆస్కార్ వరకు నడిపించింది. అలాంటి సినిమాల రూపకర్త కాశీనాథుని విశ్వనాథ్. ఆ దిగ్గజ దర్శకుడి స్వస్థలం ఉమ్మడి గుంటూరు జిల్లా పెదపులివర్రు. ఇదే జిల్లాతో ఆయనకు విడదీయలేని అనుబంధముంది. పెదపులివర్రు పండిత గ్రామం. విశ్వనాథ్ తాత కాళహస్తిలింగం పండితుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. తండ్రి సుబ్రహ్మణ్యం గ్రామ శివాలయంలో ప్రధాన అర్చకుడిగా పనిచేశారు. ఆ వారసత్వంతోనే విశ్వనాథ్ తన సినిమాల్లో పల్లెటూరుకు, సంగీతానికి, సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేశారు. తన మూలాలను, అనుబంధాలను మరువకుండా గ్రామంతోనూ, జిల్లాతోనూ స్నేహసంబంధాలను కొనసాగిస్తూ వచ్చారు. గుంటూరులోని సాహితీ సమాఖ్యతో అనుబంధం అలాంటిదే. వ్యవస్థాపక కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణతో విశ్వనాథ్‌కు 35 ఏళ్లనుంచి అనుబంధం. ఒకప్పుడు విజయవాడలో విశ్వనాథ్ సోదరి గిరిజ ఇంట్లో అద్దెకున్న లక్ష్మీనారాయణ అప్పట్లో చిన్మయ మిషన్ యువకేంద్రం కార్యదర్శి. సూత్రధారులు, స్వర్ణకమలం సినిమాలు తీస్తున్న రోజుల్లో తరచూ ఆ ఇంటికి వచ్చే విశ్వనాథ్‌కు లక్ష్మీనారాయణకు కుదిరిన స్నేహం కొనసాగింది. గుంటూరులో సాహితీ సమాఖ్య ఏర్పాటు చేశాక ఏటా ఉగాదికి సాహితీ వసంతోత్సవం జరుపుతున్నారు. తెలుగు ప్రముఖులను సత్కరిస్తున్నారు. తొలి ఏడాది విశ్వనాథ్‌కు ఆ గౌరవం దక్కింది. 2014లో నంబూరులోని వీవీఐటీ కాలేజీకి వచ్చినప్పుడు అక్కడ ప్రదర్శించిన 'సాగర సంగమం' సినిమాను 800 మంది విద్యార్థులతో కలిసి తిలకించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ తన స్నాతకోత్సవంలో విశ్వనాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. గుంటూరులోని స్వధర్మ సేవాసంస్థ 2011 ఆగస్టులో బృందావన్ గార్డెన్స్‌లోని కళావేదికపై కె.విశ్వనాథ్‌కు 'ధర్మజ్యోతి' బిరుదును ప్రదానం చేసి, రూ.లక్ష నగదును అందజేసింది. అక్కడి వేంకటేశ్వర స్వామి ఆలయం కె.విశ్వనాథ్‌లోని దర్శకుడికి బాగా నచ్చింది. 'శుభప్రదం' అనే సినిమాలో ఒక పాటను ఇదే ఆలయంలో చిత్రీకరించారు. కళల తెనాలి కె.విశ్వనాథ్‌ను పలుసార్లు గౌరవించుకుంది.



పెదపులివర్రుకు వన్నె తెచ్చిన మహనీయుడు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రుకు వన్నె తెచ్చిన కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. విశ్వనాథ్ మరణ వార్తను శుక్రవారం సామాజిక మాధ్యమాలు, దినపత్రికల్లో చూసి గ్రామస్తులు కనులు చెమర్చాయి. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్న విశ్వనాథ్‌కు 2016లో గ్రామస్తులు గ్రామ నడిబొడ్డున ఉన్న శివవైష్ణవాలయాల ఆవరణలో పౌర సన్మానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. విశ్వనాథ్ పూర్వీకులు బాలా త్రిపురసుందరి సమేత రాజరాజనరేంద్రస్వామి (శివాలయం)ఆలయ వంశ పారంపర్య స్థానాచార్యులుగా బాధ్యతలు నిర్వహించారు. విశ్వనాథ్‌కు మంచి పేరు తీసుకువచ్చిన శంకరాభరణం సినిమా విడుదలైన రోజునే ఆయన పరమపదించారు. ఈ సినిమా ఫిబ్రవరి 2న 1980లో విడుదలైంది. 2010లో కూచిపూడిలో వెంపటి చినసత్యం విగ్రహావిష్కరణకు విచ్చేసిన విశ్వనాథ్‌ను గ్రామానికి తీసుకువచ్చి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో, దేవాలయంలో సన్మానించినట్లు తానా మాజీ ప్రెసిడెంట్ నాదెళ్ల గంగాధర్, డాక్టర్ ప్రకాశరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ గుత్తా వెంకటరత్నం, పరిశ రమేష్ గుర్తుచేసుకున్నారు.



కె.విశ్వనాథ్‌ను సన్మానిస్తున్న పెదపులివర్రుకు చెందిన వైష్ణవాలయ అర్చక బృందం (ఫైల్)



గుంటూరులో సాహితీ వసంతోత్సవంలో నాటి జిల్లా కలెక్టర్ జయలక్ష్మితో కె.విశ్వనాథ్

ఉద్దండులకు పేరుగాంచిన పెదపులివర్రు..

సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ఈ గ్రామ అల్లుడే. పాటల రచయిత సముద్రాల రాఘవాచారి ఈ ఊరివాసే. గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మేనమామ ములుగు కుమారస్వామిది ఈ గ్రామమే. కంచి కామకోటి పీఠాధిపతులు ఆది శంకరాచార్యులు రాసిన వ్యాకరణాన్ని తెలుగులో అనువదించిన వారణాసి సుబ్బయ్య ఈ గ్రామ వాసే. తానా మాజీ అధ్యక్షుడు నాదెళ్ల గంగాధర్, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడా కారిణి గుత్తా జ్వాల ఈ గ్రామానికి చెందిన వారే.

అమరావతిలో కళాతపస్వి జ్ఞాపకాలు

అమరావతి: ప్రముఖ సినీ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ గురువారం రాత్రి కన్నుమూయడంతో అమరావతి వాసులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని సంతాపం వ్యక్తం చేశారు. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో 1981లో సప్తపది చిత్రాన్ని అమరావతిలో సుమారు మూడు నెలల పాటు చిత్రీకరించారు. హిందీ వర్షన్‌ను కూడా అమరావతి పరిసర ప్రాంతాల్లో 1984లో సుమారు నెల రోజులపాటు షూట్ చేశారు. తెలుగు సప్తపది షూటింగ్ కోసం నటీనటులు గిరీష్‌ప్రధాన్, సబిత, జేవీ సోమయాజులు, అల్లు రామలింగయ్య, రవిశంకర్, హిందీలో జాగుఉఠా ఇన్సాన్ సినిమా కోసం మిథున్‌చక్రవర్తి, సినీనటి శ్రీదేవి, రాకేష్‌రోషన్ అమరావతిలో ఉండటంతో నాటి మధుర జ్ఞాపకాలను స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. వైకుంఠపురం గ్రామస్తులు కూడా తమ గ్రామంతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని సంతాపం తెలియజేశారు.




కథానాయికి సరితకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు విశ్వనాథ్ (ఫైల్)



కళాతపస్వికి అక్షర నివాళి

తెనాలిటౌన్: కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు ఓ చిత్ర కళోపాధ్యాయుడు అక్షర నివాళులర్పించారు. ఆయన దర్శకత్వం, కథలతో చిత్రాల పేర్లను వరుస క్రమంలో రాసి విశ్వనాథ్ చిత్రాన్ని చిత్రీకరించారు. పెదరావూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్ర కళాఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఫణీదపు వెంకటకృష్ణ ఈ చిత్రాన్ని గీశారు.

● విశ్వనాథ్ నేను కలసి చదువుకున్నాం



నేను విశ్వనాథ్ పక్కపక్కన ఇళ్లలో ఉండేవాళ్లం. 5వ తరగతి వరకు ఇక్కడే కలసి చదువుకున్నాం. విశ్వనాథ్ తండ్రి వాహిని పిక్చర్ ప్యాలెస్‌లో ఎండీగా పని చేసేవారు. పదేళ్ల ప్రాయంలో విశ్వనాథ్ ఇక్కడ నుంచి విజయవాడ వెళ్లారు. సినీ నేపథ్య గాయకులైన ఘంటసాల వెంకటేశ్వరరావు నాకు స్వయాన బావ. సినిమాలపై మోజుతో ఘంటసాల ద్వారా ప్రొడక్షన్ మేనేజర్‌గా వాహిని స్టూడియోలో చేరాను. కొంత కాలానికి నేను తిరిగి స్వ గ్రామానికి వచ్చే శాను. ఏటా దసరా, మహాశివరాత్రి రోజుల్లో విశ్వనాథ్ స్వామివార్లకు పట్టువస్త్రాలు పంపుతుండేవారు. చిననాటి స్నేహితుడిగా నాకు కూడా పట్టు వస్త్రాలు, ధోవతులు పంపేవారు.

– కొడమంచిలి వెంకట సుబ్బారావు, విశ్వనాథ్ చిననాటి స్నేహితుడు

● విశ్వనాథ్ కారణజన్ముడు



తెలుగు సినిమాకు వన్నె తెచ్చిన మహనీయుడు కళాతపస్వి కె.విశ్వనాథ్. ఎన్నో అద్భుతమైన సినిమాలు చిత్రీకరించారు. ఆయన తీసిన చిత్రాలు తెలుగు సినిమాకే గర్వకారణం. విశ్వనాథ్‌కు మంచిపేరు తీసుకువచ్చిన శంకరాభరణం సినిమాను ఎప్పటికీ తెలుగు ప్రేక్షకుల మదిలో నుంచి చెరపలేము. ఆ సినిమాను నేను కూడా పలుమార్లు చూశాను. ఆయన లేని లోటు ఎన్నటికీ తీరనిది. భట్టిప్రోలు మండలం వెల్లటూరు వాసిగా మా మండలంలో జన్మించిన విశ్వనాథ్ కారణజన్ముడు.

– డాక్టర్ మేరుగ నాగార్జున, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

పేద విద్యార్థుల ఆకాంక్షలు నెరవేర్చేందుకే..

● జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ● జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం నమూనా చెక్కు అందిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: పేద విద్యార్థుల ఉన్నత విద్య ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రభుత్వం తగిన సాయం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద లబ్ధిపొందిన విద్యార్థులకు నమూనా చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ పథకం కింద బాపట్ల జిల్లాలో ఈబీసీ విద్యార్థులు అరుగురు, బీసీ విద్యార్థి, మైనార్టీ విద్యార్థి ఒకరు లబ్ధిపొందుతున్నారని వివరించారు. బాపట్ల జిల్లాకు మొదటి విడతగా రూ.79,09,379ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. చదువుకోవడానికి పేదరికం అడ్డు రాకూడదని ప్రభుత్వం గొప్ప అవకాశాలను కల్పించడం అభినందనీయమని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి రాజదెబోరా, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కల్పన, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సైదా దస్తగిరి పాల్గొన్నారు.

గుండ్లకమ్మ పూడికతీతకు గ్రీన్ సిగ్నల్

కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడి

బాపట్ల: గుండ్లకమ్మ నదిలో పూడికతీత ద్వారా ఇసుక తవ్వకాలకు(డీ సిల్టేషన్) జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఆమోదముద్ర వేసింది. స్థానిక కలెక్టరేట్‌లో బాపట్ల జిల్లాలోని వాగులు, వంకల్లో ఇసుక లభ్యతపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ప్రజా అవసరాలకు తగినట్టుగా గుండ్లకమ్మ నదిలో ఇసుక లభ్యత ఉందని చెప్పారు. డీ సిల్టేషన్ ద్వారా ఇసుక తవ్వడానికి ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. నదిలో 6.54 చదరపు కిలోమీటర్ల పరిధిలో పూడికతీత ద్వారా ఇసుక తవ్వడానికి అవకాశం ఉందని వివరించారు. ఆ ప్రాంతంలో 2,95,072 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వడానికి అధికారికంగా ఆమోదిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో జిల్లాలోని ప్రజా అవసరాలకు ఇసుక అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్యాకేజీ–2 వద్ద ఇసుక తవ్వడానికి జేపీ వెంచర్స్ సంస్థకు అనుమతులు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో కొత్తగా ఏడు ఇసుక రేవులను గుర్తించినట్లు తెలిపారు. అందులో అద్దంకి మండలంలోని వెంపరాల, నరసింహాపురం(గోపాలపురం), రామాయపాలెం, తిమ్మాయపాలెం, వేలమూరిపూడి, మోదేపల్లి, బల్లికురువ మండలంలోని వెలమవారిపాలెం ప్రాథమికంగా గుర్తించామన్నారు. సమగ్ర పరిశీలన చేసి స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కమిటీలోని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనుమతులు లేని ప్రాంతాలలో ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టాలని కోరారు. రేవుల్లో తవ్వకాలను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, అదనపు ఎస్పీ మహేష్, భూగర్భ గనుల శాఖ డీడీ జగన్నాథరావు, సెబ్ డీఎస్పీ నరసింహారావు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2500, గరిష్ట ధర రూ.3300, మోడల్ ధర రూ.2800 వరకు పలికింది.

రాజధాని ప్రజలకు స్మార్ట్ విద్య, వైద్యం

● పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి

● రాయపూడి, కురగల్లు గ్రామాల్లో ఏఎస్‌ఎస్‌సీఎల్ పైలెట్ ప్రాజెక్టుల పరిశీలన



పైలెట్ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి

రాయపూడి(తాడికొండ)/మంగళగిరి: రాజధాని గ్రామాల్లో చేపడుతున్న పైలెట్ ప్రాజెక్టులతో స్థానిక ప్రజలకు అత్యున్నతమైన విద్య, వైద్యం అందుబాటులోకి వస్తుందని ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఏపీ సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్‌తో కలిసి శుక్రవారం ఆమె రాజధాని గ్రామాల్లో పర్యటించారు. ఏఎస్‌ఎస్‌సీఎల్ చేపడుతున్న పలు పైలెట్ ప్రాజెక్టులను పరిశీలించారు. ముందుగా రాయపూడిలోని ఈ–హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ఆమె మీడియాతో మాట్లాడారు. త్వరలో ప్రజలకు సమున్నతమైన వైద్య, ఆరోగ్య సేవలు అందించబడతాయని, రూ.1.77 కోట్లతో జరుగుతున్న హెల్త్ సెంటర్ పనులు త్వరలో పూర్తికానున్నాయని తెలిపారు. అవుట్ డోర్ జిమ్, ఇండోర్ జిమ్ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. రోగులకు ఉపయోగకరమైన ఔషధ మొక్కలు, నీడనిచ్చే చెట్లు పెంచాలని, వాకింగ్ ట్రాక్‌లు నిర్మించాలని సీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. ఈ హెల్త్ సెంటర్‌కు అంబులెన్స్‌ను అందించిన దాతలను అభినందించారు. అనంతరం కురగల్లులో నిర్మిస్తున్న మోడల్ అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని పరిశీలించారు. ఈ కేంద్రాన్ని రూ.1.6 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. అధునాతన సదుపాయాలతో మరో 22 అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్మాణాల ప్రగతిపై అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

25 గ్రామాల్లో అధునాతన విద్య, ఆరోగ్య సదుపాయాలు

అమరావతి ప్రాంతంలోని 25 గ్రామాల్లో అధునాతన విద్య, ఆరోగ్య సదుపాయాలు మెరుగుపరిచేందుకు 64 ప్రాజెక్టులు చేపడుతున్నామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులుగా రాయపూడి, కురగల్లు, మల్కాపురం గ్రామాల్లో పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ కట్టా సింహాచలం, చీఫ్ ఇంజినీర్ జీవీ పక్షం రాజు, గ్రూప్ డైరెక్టర్ ఎస్.శర్మద, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ స్వర్ణమేరి, జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ మృణ్మయి తదితరులు పాల్గొన్నారు.

కూతపెట్టిన రైలు

● రైల్వే బడ్జెట్‌లో భారీ కేటాయింపులు

● నడికుడి–శ్రీకాళహస్తికి రూ.202 కోట్లు

● విజయవాడ– గూడూరు మూడో లైన్‌కు రూ.800 కోట్లు

● గుంటూరు–గుంతకల్ డబ్లింగ్‌కు రూ.980 కోట్లు

● గుంటూరు – బీబీనగర్ డబ్లింగ్‌కు రూ.68 కోట్లు

● పగిడిపల్లి– నల్లపాడు విద్యుదీకరణకు రూ.32.8 కోట్ల కేటాయింపు



మాట్లాడుతున్న డీఆర్‌ఎం రామకృష్ణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు/లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు పెద్దపీట వేశారు. గుంటూరు డివిజన్‌కు కూడా భారీ కేటాయింపులు దక్కాయి. నడికుడి – శ్రీకాళహస్తి లైన్‌కు రూ.202 కోట్లు కేటాయించారు. 2011–12లో 309 కిలోమీటర్ల మేర కొత్త లైన్ వేయడానికిగాను 2,289 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. ఇందులో 50 శాతం రాష్ట్ర వాటా కాగా, దీని కోసం భూసేకరణకు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించింది. పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం వరకూ 46 కిలోమీటర్లు ఇప్పటికే పూర్తయింది. విద్యుదీకరణ పనులు కూడా పూర్తయ్యాయి. మిగిలిన పనులు జరుగుతున్నాయి. గుంటూరు నుంచి గుంతకల్ వరకు డబ్లింగ్ పనుల కోసం రూ.980 కోట్లు కేటాయించారు. 2016–17లో ప్రారంభం అయిన ఈ ప్రాజెక్టు దూరం 404 కిలోమీటర్లకు రూ.3,631 కోట్లు కేటాయించారు. దీనిలో 159 కిలోమీటర్ల మేర డబ్లింగ్, విద్యుదీకరణ పనులు పూర్తిచేశారు. నల్లపాడు–సాతలూరు, ఎద్దులదొడ్డి–దోన్, చీకటితీగలపాలెం–తర్లుపాడు మధ్య పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పనుల కోసం భారీగా నిధులు కేటాయించారు. గుంటూరు – బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుకు రూ.60 కోట్లు కేటాయించారు. 2019–20లో రూ.2,480 కోట్లతో 248 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులు మంజూరు అయ్యాయి. దీనికోసం నిధులు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపారు. పగిడిపల్లి – నల్లపాడు మధ్య విద్యుదీకరణ కోసం రూ.32.8 కోట్లు మంజూరు అయ్యాయి. విజయవాడ –గూడూరు మధ్య మూడో లైన్ కోసం రూ.800 కోట్లు కేటాయింపులు జరిగాయి. ఇందులో ఉలవపాడు–తలమంచి, చినగంజాం–కరవది స్టేషన్ల మధ్య 87 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. ఇంకా 201 కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నాయి. గుంటూరు డివిజన్ పరిధిలోని స్టేషన్‌లలో ప్రయాణికులకు అన్ని సదుపాయాలను కల్పించేందుకు 16 రైల్వే స్టేషన్‌లను గుర్తించి వాటికి నిధులను కేటాయించారు. గుంటూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.20 కోట్లు, మిగిలిన 15 స్టేషన్‌లకు గాను రేపల్లె, నంద్యాల, మంగళగిరి, మార్కాపురంరోడ్డు, గిద్దలూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, సత్తెనపల్లి, నడికుడి, వినుకొండ, కంభం, నల్గొండ, మిర్యాలగూడ, మాచర్ల, దొనకొండ స్టేషన్‌ల అభివృద్ధికి గాను ఒక్కో స్టేషన్‌కు రూ.10 కోట్ల చొప్పున కేటాయించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ట్రాక్ రెన్యువల్స్ (పట్టాల మరమ్మతులు, మార్పులు, చేర్పులు) వంటి పనులకు గాను రూ.1360 కోట్ల కేటాయింపులు జరిగాయి.

2009 తర్వాత అత్యధిక కేటాయింపులు ఇప్పుడే..

కేంద్రం ప్రవేశపెట్టి బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎన్నడూ లేని విధంగా రూ.8,406 కోట్ల రైల్వే బడ్జెట్‌ను కేటాయించడం సంతోషదాయకమని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఆర్.రామకృష్ణ అన్నారు. శుక్రవారం డీఆర్‌ఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009 తర్వాత ఇవే భారీ కేటాయింపులని తెలిపారు. అమృత భారత్ పథకం ద్వారా 14 రైల్వే స్టేషన్‌లను గుర్తించి వాటి వివరాలను రైల్వే బోర్డుకు పంపించడం జరిగిందన్నారు. ప్రతి రైల్వే స్టేషన్‌లో కిరణా స్టోర్స్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి ప్రతిపాదన చేయడం జరిగిందని, త్వరలో అమలు చేస్తారన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోని అన్ని స్టేషన్‌లలో ఎస్కలేటర్స్, లిఫ్టులు, సైన్‌బోర్డులు, అధునాతన సౌకర్యాల కోసం రూ.717 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. గుంటూరు– గుంతకల్లు డబ్లింగ్ పనులు ఈ ఏడాది మార్చిలోగా పూర్తి అవుతాయన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 2024 ఆర్థిక సంవత్సరం లోగా పలు సెక్షన్‌లలో పనులు పూర్తి కానున్నాయని చెప్పారు. శావల్యాపురం, చీకటిగాలపాలెం పరిధిలో ఈ ఏడాది జూన్ ఆఖరులోగా పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. జేవీ కృష్ణాపురం, సోమదేవిపల్లి, గిద్దలూరు పరిధిలోని 26 కి.మీ. పనులు ఈ ఏడాది అక్టోబర్‌లోగా పూర్తి అవుతాయన్నారు. సాతులూరు, మున్నాక పరిధిలో ఈ ఏడాది జూలై, ఆగస్టులో పనులు పూర్తి చేస్తామన్నారు. గిద్దలూరు, దిగువమెట్ట పనులు వచ్చే ఏడాది 2024 మార్చి లోగా పూర్తవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీఆర్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుస్తక తపస్వి లంకా సూర్యనారాయణ

పాత గుంటూరు: పుస్తకాలను చదవడం, సేకరించటం, ధ్యాసగా, శ్వాసగా భావిస్తూ లక్షలాది పుస్తకాలతో గ్రంథాలయాన్ని భవిష్యత్ తరాల కోసం ఏర్పాటు చేసిన పుస్తక తపస్వి లంకా సూర్యనారాయణ అని అజో విభో కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ పేర్కొన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళా వేదికపై విశిష్ట సేవా పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథి ప్రొఫెసర్ ఆరేటి కృష్ణకుమారి మాట్లాడుతూ సూర్యనారాయణ గ్రంథాలయ సేవలు వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయం అన్నారు. లంకా సూర్యనారాయణ దశాబ్దాల పాటు అందించిన సుదీర్ఘ సేవలను గుర్తించి ఫౌండేషన్ చైర్మన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి రెండు లక్షల రూపాయలు నగదు పురస్కారంతో పాటు 'గ్రంథాళ్వార్' విశిష్ట సేవా పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, ఫౌండేషన్ కార్యదర్శి ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

కొల్లూరు: కృష్ణా నదీ పరీవాహక భూముల ఆక్రమణ విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ శుక్రవారం చేపట్టారు. భూముల విషయంలో ఇరువర్గాల మధ్య గత మంగళవారం చోటుచేసుకున్న ఘర్షణలో చింతర్లంకకు చెందిన ముగ్గురు స్వల్పగాయాలకు గురయ్యారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్లూరు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పెదలంక చర్చి ప్రాంగణంలో నిర్వహించిన విచారణ ప్రక్రియలో భాగంగా, ఘర్షణ సమయంలో కొద్దిపాటి గాయాలకు గురైన బాధిత వ్యక్తులతో పాటు, స్థానికులను ఇరువర్గాల నడుమ చోటుచేసుకున్న పరిణామాల గురించి సమాచారం సేకరించారు. విచారణలో భాగంగా ఎస్సీ వర్గీయులు తెలిపిన వివరాలను నమోదు చేయడంతోపాటు, వీడియో రికార్డింగ్ చేపట్టారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ విచారణ అనంతరం నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేస్తామని చెప్పారు. నదీలోని ఇసుక మేటల విషయంలో ఘర్షణలు చోటుచేసుకున్న నేపథ్యంలో 145 సెక్షన్ అమలులో ఉందని, ఇరు వర్గాలు ఆ భూముల లోకి వెళ్లరాదని హెచ్చరించారు. విచారణలో ఆయన వెంట వేమూరు సీఐ వెంకటేశ్వరరావు, కొల్లూరు ఎస్ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ ఉన్నారు.


పెదలంక చర్చి ఆవరణలో విచారిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

5న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

బాపట్ల అర్బన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు కోరారు. ఎగ్జామ్స్ ట్రైనింగ్ క్లాసెస్-2023కు సంబంధించి ఏబీఎం స్కూల్‌లో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నిర్వహించనున్న పరీక్షకు బాపట్ల జిల్లాలో రేపల్లె, బాపట్ల, చీరాల రెవెన్యూ డివిజన్లు మొత్తం 2,429 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రం రేపల్లె మూడు, బాపట్ల మూడు, చీరాల నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటల తరువాత పరీక్ష కేంద్రంలోకి ఎవరిని అనుమతించరాదని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించారు. కార్యక్రమంలో బాపట్ల, పర్చూరు ఉప విద్యాశాఖ అధికారులు జి.వెంకటేశ్వర్లు, ఎ.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పి.వి.జె.రామారావు, పక్కన అధికారులు, ప్రధానోపాధ్యాయులు

రూ.1.60 లక్షల విలువైన ఎరువులు స్వాధీనం

- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు
- రూ.11.57 లక్షల ఎరువుల అమ్మకాల నిలిపివేతకు నోటీసులు

నగరంపాలెం: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. రూ.1.60 లక్షల విలువైన ఎరువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు రూ.11.57 లక్షల విలువైన సరుకు అమ్మకాలను నిలిపివేసి నోటీసులు ఇచ్చినట్లు సీఐ ఎ.శ్రీహరిరావు తెలిపారు. వివరాలు.. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం ఈమనిలోని గాయత్రి ట్రేడర్స్, జీవిత ట్రేడర్స్ దుకాణాలలో ఎరువుల నిల్వల్లో తేడా గుర్తించారు. దీంతో 10.9 ఎంటీఎస్ ఎరువులు, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సురేష్ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో రూ.266.50(ఎమ్మార్పీ) యూరియా బస్తాను రూ.350లకు విక్రయించడంతో 3.425 ఎంటీఎస్ ఎరువులు స్వాధీనం చేసుకుని '6ఎ' కేసు నమోదు చేశామన్నారు. గణేష్ ట్రేడర్స్, వెంకటేశ్వర రైతు సేవా కేంద్రాల్లో అనుమతుల్లేని రూ.11.57 లక్షల 49.6 ఎంటీఎస్ ఎరువుల అమ్మకాలు నిలిపివేస్తూ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకిలోని నాగేశ్వర ట్రేడర్స్‌లో యూరియా బస్తా రూ.266.50కు విక్రయించాల్సి ఉండగా, రూ.300కు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. దీంతో రూ.74,586 విలువ చేసే 7.110 ఎంటీఎస్ యూరియా, 1.150 ఎంటీఎస్ డీఏపీని స్వాధీనం చేసుకుని '6ఎ' కేసు నమోదు చేశామన్నారు. వెంకటేశ్వర ట్రేడర్స్‌లో జీరో ఫారమ్స్ లేకపోవడంతో 5.45 డీఏపీ, ఫాక్ట్ ఎరువుల అమ్మకాలు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో సీఐ టి.లక్ష్మారెడ్డి, వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, ఎఫ్ఆర్ఓ షేక్ సైదులు, సహాయ జియాలజిస్ట్ ఎస్.ప్రసాద్, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య పాల్గొన్నారు.


ఓ దుకాణంలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తున్న దృశ్యం

పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు చర్యలు

జే.పంగులూరు: పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు కృషిచేయాలని ఎస్సీసీ జిల్లా కోఆర్డినేటర్ జి.చైతన్య అన్నారు. మండలంలోని పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీఓ కృష్ణకుమారి ఆధ్వర్యంలో పౌష్టికాహారం లోపంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీసీ జిల్లా కో ఆర్డినేటర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీలకు, మహిళా పోలీసులకు 6-12 సంవత్సరాల పిల్లలను, వెల్ఫేర్ అసిస్టెంట్లకు 13 -9 సంవత్సరాల పిల్లలను, ఏఎన్ఎంలకు బాలింతలు గర్భిణులను కేటాయించామని తెలిపారు. వీరందరూ కలిసి వారికి కేటాయించిన వారితో ముఖాముఖిగా మాట్లాడాలన్నారు. పౌష్టికాహారం లోపాన్ని నివారించడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలనేది వారికి వివరించాలని తెలిపారు. 19 ఏళ్లలోపు పిల్లలకు పౌష్టికారలోపం ఎక్కువగా ఉందని గుర్తిచామన్నారు. సంపూర్ణ ఆరోగ్య జిల్లాగా చేయడమే జిల్లా కలెక్టర్ ఉద్దేశమని, అందుకోసమే ప్రతి శుక్రవారం సంభాషణ సమావేశం, ప్రతి మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు మల్లికార్జున రావు, శివచెన్నయ్య, భారతీ హెల్త్ డిక్టేటర్ అనురాధ, మహిళా పోలీసులు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీసీ జిల్లా కోఆర్డినేటర్ చైతన్య

ఉన్నత వ్యక్తిత్వమే భవిష్యత్‌కు పునాది

డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు

బాపట్ల: వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడంలో వ్యవసాయ విద్యార్థులు క్రమశిక్షణతో వ్యవహరించాలని, వ్యక్తిత్వమే ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దుతుందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. డాక్టరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలోచనా జ్ఞానాన్ని విస్తరించడం, పొందిన జ్ఞానాన్ని ఆచరించేందుకు శ్రమించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. పాజిటివ్ దృక్పథంతో సాగితే శక్తివంతులుగా తయారవుతారని చెప్పారు. తద్వారా విజయాలు ఒడిలోకి వచ్చి చేరతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.చంద్రశేఖర్, బి.రత్నకుమారి, వి.సీతారాంబాబు పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం

కొల్లూరు: భార్య ప్రవర్తనపై అనుమానంతో ఆమెను హతమార్చేందుకు భర్త ప్రయత్నించిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. చొప్పర చంద్రపాల్, కుమారి అనే మహిళను కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇద్దరికి రెండో వివాహం. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. కుమారి వేరే గ్రామంలోని వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగిస్తూ తనను పట్టించుకోవడంలేదని తరచూ ఆమెతో గొడవపడుతున్నాడు. గురువారం రాత్రి వివాదంతో చంద్రపాల్ సమీపంలో ఉన్న చాకుతో భార్యపై దాడి చేశాడు. క్షతగాత్రురాలిని వెంటనే తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన విషయంలో వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ తెలిపారు.

బాలికపై యువకుడి లైంగిక దాడి

తెనాలి రూరల్: బాలిక(11)పై ఏడాదిగా లైంగిక దాడికి పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన ఓ మహిళ సుమారు ఎనిమిదేళ్ల క్రితం తన భర్తతో విడిపోయి ఇక్కడి ఉప్పుబజారుకు చెందిన మరో వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఆమెకు కుమార్తె ఉంది. సహజీవనం చేస్తున్న వ్యక్తికి అప్పటికే భార్య మృతి చెందింది. కుమారుడు సతీష్ చంద్ర(ప్రస్తుతం 21 ఏళ్ల వయసు) ఉన్నాడు. వీరు నలుగురు కలసి ఉప్పుబజారులోని సొంత ఇంటిలో నివసిస్తున్నారు. బాలికకు జనవరిలో తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. గమనించిన తల్లి కొత్తపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు బాలిక ఏడు నెలల గర్భిణి అని చెప్పడంతో విషయం బయటపడింది. వైద్యుల సూచన మేరకు గుంటూరు సమగ్ర వైద్యశాలకు తీసుకెళ్లింది. సతీష్‌చంద్ర తనపై సుమారు ఏడాదిగా లైంగికదాడికి పాల్పడుతున్నట్లు బాలిక తల్లికి చెప్పినట్లు తెలిసింది. బాలిక గర్భిణిగా వైద్యశాలలో చేరిందని అక్కడ ఉండి వచ్చిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు గుంటూరు వైద్యశాలకు వెళ్లి బాలిక నుంచి వివరాలు సేకరించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయగా, డీఎస్పీ కె. స్రవంతిరాయ్ దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి బాలిక దుర్మరణం



కారంచేడు: ఇంటి ముందు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి రెండేళ్ల బాలిక దుర్మరణం చెందింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం మండల కేంద్రం కారంచేడు గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని ముస్లిం కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పఠాన్ ఖాశీం బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అతడికి ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమార్తె పఠాన్ మాహిన్(2) ఉదయం ఎప్పటి మాదిరిగానే ఇంటి ముందు చెరువు గట్టు మీద చెట్ల నీడలో ఆడుకుంటుంది. తల్లి, కుటుంబ సభ్యులు, సమీపస్తులు కూడా అక్కడే ఉన్నారు. ఆడుకుంటున్న మాహిన్ ఒక్కసారిగా కనిపించలేదు. వెంటనే అప్రమత్తమైన తల్లి, బంధువులు ఇంటి సమీపంలో వెతికారు. అయినా పాప ఆచూకీ కనిపించలేదు. దీంతో పక్కనే ఉన్న పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు చెరువులో వెతకగా పాప మృతదేహం దర్శనమిచ్చింది. దీంతో తల్లి, కుటుంబ సభ్యుల రోధనలతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలముకున్నాయి. తండ్రి అప్పటికే తన పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. కూతురు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న తండ్రి బోరున విలపించాడు.

11,12 తేదీల్లో గుంటూరులో బాలోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈనెల 11,12 తేదీల్లో గుంటూరులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాల వేదికగా నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గుంటూరు జిల్లా బాలోత్సవం-పిల్లల పండుగ-2023 పోస్టర్లను ఆవిష్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ 23 అంశాల్లో నిర్వహిస్తున్న బాలోత్సవ్‌లో 4,5,6,7 తరగతుల విద్యార్థులకు జూనియర్, 8,9,10 తరగతులకు సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేందుకు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవ్ కన్వీనర్ ఎం. బోసుబాబు, జి.వెంకటరావు, చావా శ్రీనివాస్, ఇ.అనిల్‌కుమార్, బి.శంకర్‌సింగ్, ఉప్పాల రామమోహనరావు, పి.అనంతలక్ష్మి, ఆర్.స్వాతి, టీఆర్ చాందిని, ఎం.ఉదయ్‌భాస్కర్, జోజిబాబు, ఇ.ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.


బాలోత్సవ్ పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, బోసుబాబు, రామ్మోహనరావు

మిర్చి వ్యాపారిపై చర్య తీసుకోవాలి

బాధిత రైతుల వినతి

పట్నంబజారు: మిర్చి కమీషన్ వ్యాపారి బర్మా వెంకట్రావు తమకు మిర్చికి సంబంధించి కోట్లాది రూపాయలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారి నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో ఉన్నాడని తెలుసుకున్న ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం నడ్డిపాడు గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులు గుంటూరు వచ్చారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలసి తమ సమస్యను వివరించేందుకు వచ్చినట్లు తెలిపారు. అనంతరం నగరంపాలెం పీఎస్ వద్దకు చేరుకుని, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ హైమారావును కలసి సమస్యను వివరించారు. ఎస్పీ అందుబాటులో లేరని, సోమవారం వచ్చి ఫిర్యాదు చేయాలని ఎస్‌హెచ్‌ఓ వారికి సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలు మిర్చియార్డులో వెంకట్రావుకు పంటను విక్రయిస్తున్నారని, సుమారు 60 మంది రైతులకు పైగానే డబ్బులు రావాల్సిన వారు ఉన్నారని రూ.5కోట్లు వరకు రైతులకు చెల్లించాల్సి ఉందని ఆరోపించారు. రైతులకు న్యాయం చేసేలా అధికారులు దృష్టి సారించాలని, వారిని కలిసి మా సమస్యలను వివరిస్తామని పేర్కొన్నారు.


ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

క్వారీ తిరునాళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణం వద్ద తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఎస్పీ స్రవంతిరాయ్ హాజరయ్యారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ భక్తులకు త్వరతగతిన దైవదర్శనం జరిగే విధంగా క్యూ లైన్లు ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖాధికారులకు సూచించారు. తిరునాళ్ల రోజు నారాకోడూరు - తెనాలి రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు రాకుండా గతంలో లాగా ప్రత్యామ్నాయంగా నారాకోడూరు బైపాస్ రోడ్డు మార్గాన్ని ఉపయోగించాలని సూచించారు. రహదారి మార్గానికి అవసరమైన మరమ్మతులు వెంటనే చేయాలని ఆదేశించారు. మినీ బైపాస్ ద్వారా వాహనాల రాకపోకలు సాగించటం ద్వారా కొంత ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. లారీల రాకపోకలను క్రమబద్ధీకరించాలని చెప్పారు. దేవాలయం ప్రాంగణం వద్ద రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు దుకాణాలు పెట్టకుండా ప్రత్యేకమైన స్థలంలో వ్యాపారాలు నిర్వహించుకోవాలని కోరారు. తెనాలి సబ్ కలెక్టర్ గీతా శర్మ మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా ఇప్పటి వరకు తీసుకున్న పనులు, చేపడుతున్న కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్ల వద్ద ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్ల సేవలను ఉపయోగించుకోవాలన్నారు. తెనాలి డీఎస్పీ కె.స్రవంతిరాయ్ మాట్లాడుతూ తిరునాళ్ల రోజున 400 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు సహకారం అవసరం అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనూరాధ, విద్యుత్‌శాఖ డీఈ, ఇన్‌చార్జి తహసీల్దారు, దేవదాయశాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు, కిరణ్, ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వైపీఏ ప్రసాద్ తిరునాళ్ల సందర్భంగా చేపట్టనున్న పనుల గురించి తెలియజేశారు. క్వారీ దేవాలయ పరిసర ప్రాంతంతో ఏర్పాట్లను పరిశీలించారు.